క్లుప్తంగా

సన్నబియ్యం పంపిణీతో పేదలకు మేలు

మరికల్: రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీతో పేదలకు ఎంతో మేలు చేకూరుతోందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు హరీశ్, నాయకులు రామకృష్ణ, గోపాల్, సత్యన్న అన్నారు. గురువారం వారు విలేకర్లతో మాట్లాడుతూ.. గతంలో ప్రజలు దొడ్డు బియ్యం తిన్నడానికి ఇష్టపడే వారు కాదన్నారు. ప్రతి రేషన్ దుకాణంలో ఈ నెలకు సంబంధించిన బియ్యాన్ని రేషన్ కార్డుదారులు అందరూ తీసుకెళ్లడం శుభసూచికమన్నారు. సన్నబియ్యం పంపిణీతో పేదలు కడుపునిండా తింటున్నారని అన్నారు. మరోవైపు బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడిందన్నారు. రేషన్ దుకాణాల్లో పేదలకు సన్నబియ్యం పంపిణీతో ఇతర రాష్ట్రాలు తెలంగాణ వైపు చూస్తున్నాయని తెలిపారు. సమావేశంలో ఆంజనేయులు, రాజు, చెన్నయ్య, గోవర్ధన్, రఘు తదితరులు ఉన్నారు.

కార్మికులపై వేధింపులు ఆపాలి

నర్వ: గ్రామాల్లో కార్మికులపై వేధింపులు ఆపాలని పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు గొల్ల రాంచంద్రి అన్నారు. గురువారం మండల కేంద్రంలో కార్మికులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామపంచాయతీల్లో కార్మికులు విధి నిర్వహణలో అలుపెరగకుండా పనిచేస్తున్నప్పటికీ.. కొందరు పంచాయతీ కార్యదర్శులు పనిగట్టుకొని కార్మికులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. పంచాయతీ కార్మికుల హక్కుల కోసం ఆందోళనకు వెనకాడబోమని తెలిపారు.

జములమ్మ ఆలయానికి రూ.లక్ష విరాళం



నర్వ: మండలంలోని పెద్దకడ్మూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న జములమ్మ ఆలయానికి నర్వ పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి రూ.లక్ష విరాళం అందించారు. ఆలయ నిర్మాణానికి సహకరించాలని గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు తనవంతు సాయం అందించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డిని ఆలయ నిర్వాహకులు ఎం.లక్ష్మన్న, డీలర్ వెంకటయ్య, తెలుగు పెద్దచెన్నప్ప శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

రజతోత్సవ సభ జయప్రదం చేయండి

మరికల్: వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజోత్సవ సభకు పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి కోరారు. మండల కేంద్రంలో గురువారం వారు విలేకర్లతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆధ్వర్యంలో నిర్వహించే రజోత్సవ సభకు మండలం నుంచి పెద్దఎత్తున తరలివెళ్లేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లో సభకు సంబంధించిన పోస్టర్లు విడుదల చేశామన్నారు. రజతోత్సవ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు. పట్టణ అధ్యక్షుడు చంద్రశేఖర్, బాలకృష్ణ, హుస్సేన్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహారెడ్డి ఉన్నారు.

జీఓ 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలి

నారాయణపేట టౌన్: గ్రామపంచాయితీ కార్మికులకు జీఓ 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలని టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయపల్లి రాము డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఒకరోజు టోకెన్ సమ్మె, నిరసన కార్యక్రమం చేపట్టారు. ముందుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు కనీస వేతనం అమలు చేయకుండా శ్రమ దోపిడీ చేస్తుందన్నారు. కార్మికుల వేతనాలు పెంచడంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు నర్సింహులు, వెంకటయ్య, పరశురాములు, కృష్ణయ్య పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

దేవరకద్ర రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలైన ఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ నాగన్న కథనం మేరకు.. పట్టణ శివారులోని పెట్రోల్ బంక్ వద్ద గాయాలతో పడి ఉన్న ఓ వ్యక్తిని గుర్తించి స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బాధితుడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అన్నదాతపై ప్రకృతి కన్నెర్ర

- మొన్న నీరందక ఎండిన పంట
- నేడు వడగండ్ల వానకు నేలవాలిన వరి
- రూ.కోట్లలో నష్టపోయిన రైతులు



పల్లెగడ్డలో నీరందక ఎండిన పంట

నవాబుపేట: అన్నదాతలపై ప్రకృతి కన్నెర్ర జేసింది. యాసంగిలో మండలంలో సుమారు రూ.3 కోట్లకుపైగా రైతులు పెట్టుబడులు నష్టపోయారు. ఈసారి భూగర్భ జలమట్టం తగ్గినందున పంటల సాగు సైతం తక్కువగానే చేసినా.. ఆ పంటలు కూడా సరిగా పండక నష్టాల పాలయ్యారు. తాజాగా నీరందక 413 ఎకరాల వరి పంట ఎండిపోయింది. ఇదిలా ఉంటే మంగళవారం కురిసిన అకాల వడగండ్ల వర్షానికి 365 ఎకరాల వరి పంట నేలవాలింది. మొత్తంగా 778 ఎకరాల పంటకు నష్టం వాటిల్లడంతో పెట్టుబడి కూడా చేతికందక రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గతేడాది యాసంగిలో సుమారు పది వేల ఎకరాలకుపైగా వరి సాగు కాగా.. ఈసారి 6,894 ఎకరాల్లో వరి వేసినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం పెట్టుబడిని దృష్టిలో ఉంచుకొని పంట నష్ట పరిహారం అందించాలని అన్నదాతలు కోరుతున్నారు.



రుద్రారంలో వడగండ్ల వానకు నేలవాలిన వరి

ప్రభుత్వమే ఆదుకోవాలి..



నేను 6 ఎకరాల వరి సాగు చేశా. రెండ్రోజుల్లో పంట ఇంటికి వస్తుందని ఆశించిన తరుణంలోనే వడగండ్ల వర్షం కురవడంతో పంటంతా నేలరాలింది. ప్రభుత్వం స్పందించి నాలాంటి రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

– రమేష్, రైతు, రుద్రారం

పరిహారం ఎక్కువగా ఇవ్వాలి



రైతులు ఆందోళనతోనే యాసంగి సాగుకు ముందుకొచ్చారు. మొదట్లో సరిగా నీరందక బోర్లు వేశాం. తీరా పంట పండిందని అనుకుంటున్న తరుణంలో వడగండ్ల వర్షం కురిసి పంట నేలవాలి కన్నీరు మిగిలాయి. వరి సాగు ఎకరాకు రూ.40 వేల వరకు పెట్టుబడి అయింది. ప్రభుత్వం పెట్టుబడికి తగ్గట్టుగానే నష్ట పరిహారం అందించి ఆదుకోవాలి.

– రాఘవేందర్, రైతు, కొండాపూర్

ప్రభుత్వానికి నివేదిస్తాం..

మండలంలో మంగళవారం కురిసిన అకాల వడగండ్ల వర్షానికి 365 ఎకరాలకు పైగా పంట నష్టపోయినట్లు తెలిసింది. ఒక్క రుద్రారం గ్రామంలోనే దాదాపుగా 187 ఎకరాల్లో వరి పంట నేలరాలింది. కొండాపూర్, కొల్లూర్, పోమాల్‌లో వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. పంట నష్టం అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తాం. – కృష్ణకిషోర్, మండల వ్యవసాయ అధికారి, నవాబుపేట

సమస్యల పరిష్కారానికి కృషి



వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

నారాయణపేట రూరల్: డీఎస్సీ–2008 ఉపాధ్యాయులకు పీఆర్టీయూ అండగా ఉంటూ.. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు యాద్గీర్ జనార్దన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలస్యంగా ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులకు త్వరగా ఎంప్లాయీ ఐడీ కేటాయించి.. వేతనం వచ్చే విధంగా తమవంతుగా అధికారులు, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు ఉపాధ్యాయులు సంఘ బాధ్యులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు తిరుపతి, వెంకట్‌రెడ్డి, రఘువీర్, మొల్గాన్ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

గాలివానతో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

దామరగిద్ద: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. అకాల వర్షంతో అక్కడక్కడ ధాన్యం తడిసిపోగా.. వరిపైరు నేలకొరిగింది. అన్నాసాగర్ తదితర గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయి ప్రమాదకరంగా మారాయి. విషయాన్ని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయితే విద్యుత్ స్తంభాలను సరిచేయడంపై అధికారులు నామమాత్రంగా స్పందించినట్లు తెలిపారు. వ్యవసాయ పొలాల్లో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలతో ప్రమాదాలు జరగకముందే సరిచేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



అన్నాసాగర్ సమీపంలోని వరి పొలంలో ఒరిగిన విద్యుత్ స్తంభం

లక్ష్యంతోనే ఉన్నత శిఖరాలకు..



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): లక్ష్యం నిర్దేశించుకుంటేనే ఉన్నత శిఖరాలకు చేరుకుంటామని కలెక్టర్ విజయేందిర అన్నారు. గురువారం రాత్రి స్థానిక తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను ఆమె సందర్శించారు. 9వ తరగతి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి అందుతున్న బోధన, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు ఎలా రాశారు.. వేసవి సెలవుల్లో ఏం చేస్తారు.. ఇంటి దగ్గర తల్లిదండ్రులకు సాయం చేస్తారా? తదితర విషయాలు ముచ్చటించారు. అనంతరం మాట్లాడుతూ.. పదోతరగతిలో ప్రవేశించనున్నందున చదువుపై దృష్టి సారించాలని సూచించారు. చదువుతో పాటు లోక జ్ఞానం కూడా తెలుసుకోవాలని.. సమస్యలను ఎలా అధిగమించాలో సమయ స్ఫూర్తి కలిగి ఉండాలన్నారు. బాగా చదివి తల్లిదండ్రులు, పుట్టిన ఊరికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దళితవాడల్లో సమస్యలు పరిష్కరించండి

అమరచింత: దళితవాడల్లో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలంటూ మున్సిపల్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేపట్టారు. ఈమేరకు సీపీఎం మండల నాయకుడు అజయ్ మాట్లాడుతూ.. పట్టణంలోని 4, 5 వార్డుల్లో సమస్యలు తిష్ట వేసినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవట్లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో దళితులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. 4వ వార్డులో మహిళల కోసం సామూహిక మరుగుదొడ్లు నిర్మించాలని కోరారు. పాత ఇనుప కరెంట్ స్తంభాలు తొలగించాలని, అంబేడ్కర్ భవనాన్ని అధికారికంగా ప్రారంభించి కంపౌండ్‌ను నిర్మించాలని డిమాండ్ చేశారు. 1982లో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లు మాడిగేజ్‌లో ఉన్నాయని చెప్పి లబ్ధిదారులకు నోటీసులు ఇవ్వడం సరైంది కాదన్నారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ రవిబాబుకు వినతిపత్రం అందించారు.

అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు

ఆత్మకూర్: అగ్ని ప్రమాదాలతో అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్‌రావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం ఆత్మకూర్‌లోని మాల్స్, పెట్రోల్ బంక్‌ల వద్ద అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించి విన్యాసాలను ప్రదర్శించారు. ప్రమాదాలు జరుగకుండా, అలాగే జరిగిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది సంజీవరెడ్డి, రాముడు, నర్సింహారెడ్డి, భీమేశ్వర్‌రెడ్డి, మోహన్ పాల్గొన్నారు.

పెదిరిపాడ్‌లో 'భూ భారతి' సదస్సు



పెదిరిపాడ్‌లో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న రెవెన్యూ అధికారులు

మద్దూరు: మండలంలోని పెదిరిపాడ్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో గ్రామానికి చెందిన 17 మంది రైతులు భూ సమస్యలపై దరఖాస్తు చేసుకున్నట్లు తహసీల్దార్ మహేశ్‌గౌడ్ తెలిపారు. ఖాజీపూర్‌లో నిర్వహించిన సదస్సులో 25 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ నెల 19న పర్సాపూర్, పల్లెర్ల గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కోస్గి తహసీల్దార్ బక్క శ్రీనివాస్, డీటీ వాసుదేవరావు పాల్గొన్నారు.

భూ సమస్య పరిష్కరించాలి

జడ్చర్ల: స్థానిక సరస్వతీనగర్‌కాలనీలోని భూ సమస్యను వెంటనే పరిష్కరించి న్యాయం చేయాలని కాలనీవాసులు గురువారం కలెక్టర్ విజయేందిర బోయి, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డికి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2003లో ఏర్పాటుచేసిన డీటీసీపీ వెంచర్‌లో తామంతా ప్లాట్లు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్నామని, పుర అధికారులు ఇచ్చిన అనుమతితో రోడ్లు, వీధిదీపాలు తదితర మౌలిక సదుపాయాలు కూడా కల్పించారన్నారు. కానీ 2013లో దేవాదాయశాఖ అధికారులు కాలనీ భూమిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ రిజిస్ట్రేషన్‌శాఖకు లేఖ రాయడంతో క్రయ విక్రయాలు నిలిచిపోయాయని.. స్వయంగా విచారించి న్యాయం చేయాలని కోరినట్లు వివరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో కౌన్సిలర్ సతీష్, కాలనీ ఇన్‌చార్జ్ బొక్క రాఘవేందర్, మధు, ఆంజనేయులు, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డీఎంకు మహిళా ఉద్యోగుల వినతి



స్టేషన్ మహబూబ్‌నగర్: స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ సుజాతకు గురువారం మహిళా కండక్టర్లు సమస్యల వినతిపత్రాన్ని అందజేశారు. బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య అధికం కావడంతో ఇబ్బందులు పడుతున్నామని, వారంలో రెండు ఓటీఎస్, రెండు స్పెషల్ వీక్లీఆఫ్ విధులు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా 8 గంటల డ్యూటీ అమలు చేయాలని, రాత్రి 8లోపే విధులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎంటీడబ్ల్యూ యాక్ట్ అమలు చేయాలని విన్నవించారు.

పీహెచ్‌సీలో కాన్పుల సంఖ్య పెంచాలి



పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ సౌభాగ్యలక్ష్మి

దామరగిద్ద: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాన్పుల సంఖ్య పెంచాలని డీఎంహెచ్‌ఓ డా.సౌభాగ్యలక్ష్మి సూచించారు. గురువారం స్థానిక పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించడంతో పాటు రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. అనంతరం డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల నిర్వహణపై సిబ్బంది నిర్లక్ష్యం వహించవద్దన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. వేసవిలో వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. 30 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ రక్తపోటు పరీక్షలు నిర్వహించాలన్నారు. ఓఆర్ఎస్ పాకెట్‌లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి నారాయణ, జీహెచ్‌ఎన్ జానకి, ఫార్మసిస్ట్ వెంకట్రామారెడ్డి, డీపీఎంఓ భిక్షపతి పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు



వర్క్యూర్‌లో ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న మైనింగ్ ఆర్‌ఐ ప్రతాప్‌రెడ్డి

మాగనూర్: ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మైనింగ్ ఆర్‌ఐ ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని వర్క్యూర్ శివారులో ఉన్న ఇసుక రీచ్‌లను గురువారం రెవెన్యూ ఆర్‌ఐ శ్రీశైలంతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మైనింగ్ ఆర్‌ఐ మాట్లాడుతూ.. మండలంలో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఇసుక తవ్వకాలకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే అనుమతి ఉందని స్పష్టంచేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇసుక రీచ్‌లు నడపాలని సూచించారు. ముఖ్యంగా వాగులో వాల్టా చట్టాన్ని అనుసరిస్తూ ట్రాక్టర్లలో ఇసుకను మాన్యువల్‌గా మాత్రమే నింపాలని.. అలా కాకుండా యంత్రాలను వినియోగిస్తే రీచ్‌ల అనుమతులు రద్దు చేస్తామని హెచ్చరించారు. అనంతరం వర్క్యూర్ శివారులో త్వరలో ప్రారంభించనున్న టీఎస్ఎండీసీ రీచ్‌ను పరిశీలించారు. వారి వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

'తూకాల్లో మోసాలను సహించం'



ధన్వాడ సంతలో తనిఖీలు చేస్తున్న లీగల్ మెట్రాలజీ అధికారులు

ధన్వాడ: వ్యాపారులు తూకాల్లో మోసాలకు పాల్పడితే సహించమని లీగల్ మెట్రాలజీ అధికారులు హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని సంతలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా నిబంధనలు పాటించని వ్యాపారులకు జరిమానా విధించారు. అనంతరం జిల్లా తూనికలు, కొలతలశాఖ అధికారి సత్యనారాయణ మాట్లాడుతూ.. చాలా వరకు వ్యాపారులు తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. నిబంధనల మేరకు నడుచుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా, పిచ్చుకపై బ్రహ్మాస్త్రం మాదిరిగా సంతలో కూరగాయలు అమ్ముకునే వారికి రూ.300 నుంచి రూ.1500 వరకు జరిమానా విధించడం ఎంతవరకు సమంజసమని పలువురు ప్రశ్నించారు. తమకు వచ్చే నాలుగు రూపాయలు వారికే చెల్లించామని వాపోయారు.

నర్సరీల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు



నేరడగంలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ రహ్మతుద్దీన్

మాగనూర్: నర్సరీల నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దని.. వేసవిలో మొక్కలు ఎండకుండా జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీఓ రహ్మతుద్దీన్ అన్నారు. గురువారం మండలంలోని వర్క్యూర్, నేరడగం గ్రామాల్లో నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. వన మహోత్సవానికి అన్నిరకాల మొక్కలను సిద్ధం చేయాలని పంచాయతీ కార్యదర్శి, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు. అనంతరం తాగునీటి ట్యాంకులను పరిశీలించారు. గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశంలో నీడ, తాగునీటి వసతి కల్పించాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య



నాచారంలో అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

కోస్గి రూరల్/కృష్ణా: ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులచే విద్యార్థులకు మెరుగైన విద్య అందిస్తున్నట్లు హెచ్‌ఎంలు సుమిత్ర, సంతోషి అన్నారు. గురువారం కోస్గి మండలం నాచారం ప్రాథమికోన్నత, కృష్ణా మండలం కున్సీ ఉన్నత పాఠశాలల ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాచారం, ఆలంపల్లి గ్రామాల్లో ఇంటింటి కెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను వివరించారు. విద్యార్థులకు సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం, అల్పాహారం అందించడంతో పాటు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం దుస్తులు అందిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరమల్లేష్, నరేందర్, కాసీంఅలీ, సౌమ్య, రమేశ్, భారతి, నర్సింహులు, నాగేశ్, రవితేజ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు సరికాదు



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మక్తల్: ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిపై లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదని మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీటీసీ కోళ్ల వెంకటేశ్ అన్నారు. గురువారం మక్తల్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. పార్టీలోని రెడ్డిలు, ముదిరాజ్‌లకు ఎలాంటి భేదాభిప్రాయాలు లేవని.. అందరూ సమష్టిగా ఉన్నారన్నారు. అందరూ కలిసికట్టుగా పనిచేయడంతోనే ఎన్నికల్లో వాకిటి శ్రీహరి గెలుపొందారని గుర్తుచేశారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మంత్రి పదవి వస్తుందని ఓర్వలేకనే దుష్ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. దమ్ము, ధైర్యం ఉంటే ముందుండి పోరాడాలని.. అలా కాకుండా ఎవరికీ కనిపించకుండా లెటర్లు వేయడం తగదన్నారు. రెడ్డి వర్గానికి ఎమ్మెల్యే ఏమాత్రం వ్యతిరేకం కాదని అన్నారు. లెటర్లు కేవలం ఇద్దరు, ముగ్గురికి మాత్రమే పోతున్నాయని అన్నారు. పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గణేశ్‌కుమార్, చంద్రకాంత్‌గౌడ్, రవికుమార్, శ్యామ్, సలాం, ఎం.శ్రీనివాసులు, విష్ణువర్ధన్‌రెడ్డి, రంజిత్‌కుమార్‌రెడ్డి, ఆంజనేయులు ఉన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



నిడ్జింతలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

మద్దూరు: పశువుల్లో గాలికుంటు వ్యాధిని నివారించేందుకు ఉమ్మడి మద్దూరు మండలంలో వ్యాధినిరోధక టీకాల పంపిణీ కార్యక్రమం ప్రారంభించినట్లు పశువైద్యాధికారి సబిత తెలిపారు. గురువారం మద్దూరు మండలం పల్లెర్ల, కొత్తపల్లి మండలంలోని నిడ్జింత గ్రామాల్లో 369 ఆవుజాతి పశువులు, 198 గేదెజాతి పశువులకు టీకాలు వేసినట్లు పేర్కొన్నారు. వచ్చేనెల 15వ తేదీ వరకు టీకాల పంపిణీ కార్యక్రమం కొనసాగుతుందని.. పశువుల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గోపాలమిత్రలు రాంచందర్, అశోక్‌గౌడ్, కృష్ణయ్య పాల్గొన్నారు.